# తమసోమా జ్యోతిర్గమయ

"తాతయ్యా! తాతయ్యా బెలూన్లు వచ్చాయ్! కొనివ్వవా?"

ఇంటి బయట అరుగుమీద కూర్చుని వీధిలో వచ్చీ పోయే వాళ్ళని చూస్తున్న పట్టాభి దగ్గరికి పరిగెత్తుకు వచ్చారు ఇద్దరు మనుమళ్ళు గోపీకృష్ణ, జయకృష్ణ. ఒకడికి నాలుగేళ్ళు, మరొకడికి మూడేళ్ళు. "మొన్నే కదరా ఇప్పించాను? పది రూపాయలు పెట్టి ఇప్పిస్తే పదినిమిషాలు కూడా ఉంచుకోలేదు."

"వాటిని మేం ఏం చెయ్యలేదు తాతయ్యా! గట్టిగా గాలి ఊదేసరికి పేలిపోయాయి టప్పుమని". మరి బెలూన్లంటే అంతేరా! తుస్సున గాలైనా పోతుంది. పేలైనాపోతాయి. అలాంటి వాటి కోసం డబ్బు తగలెయ్యడం దేనికి రా? కావాలంటే ఓ అయిదు రూపాయలిస్తాను చాక్‌లెట్లో బిసికెట్లో తెచ్చుకు తినండి."

"మాకు అవేం వద్దు బెలూన్లే కావాలి".

"సతాయించకండి నా దగ్గర డబ్బుల్లేవు వెళ్లండి!" కసిరాడు పట్టాభి.

పిల్లలు ఇంట్లోకి దూసుకుపోయారు. "అమ్మా బెలూన్లు వచ్చాయి. కొనిద్దువు రా! రా, అమ్మా వాడు వెళ్ళిపోతున్నాడు." వంటపనిలో ఊపిరాడనట్టుగా వున్న శైలజ చెయ్యిపట్టి చెరోవైపు లాగసాగారు.

"పొయ్యిమీద కూరమాడిపోతూంది. మీరేవెళ్ళి కొనుక్కోండి" పిల్లల చేతిలో పది రూపాయలు పెట్టి పంపేసింది. పెద్దగుమ్మడి కాయల్లా వున్న బెలూన్లని బంతుల్లా ఎగరేసి పట్టుకొంటూ ఇంట్లోకి వచ్చారు గోపీ, జయ. వాళ్ళముఖాల్లో ప్రపంచాన్ని

జయించినంత ఆనందం!

ఓ అయిదు నిమిషాలు కూడా కాలేదు. చిన్నాడి బెలూన్‌కి సూదిలా ఉన్నదేదో గుచ్చుకొని గాలిపోయింది. ఈ ప్రపంచంలో ఎవరికి రానంత కష్టం తనకే వచ్చినట్టుగా ఇల్లు ఎగిరిపోయేలా ఏడవడం మొదలు పెట్టాడు వాడు! "తమ్ముడు ఏడుస్తున్నాడు కదరా! కాస్సేపు నీ బెలూనివ్వు! ఆడుకొని ఇస్తాడు."

"ఉహూ నేనివ్వను".

"మళ్ళీ ఇప్పిస్తాగాని ఇవ్వరా".

"ఇవ్వనంటే ఇవ్వను".

ఇంతలో చిన్నాడికేమైందో పూనకం వచ్చినట్టుగా అన్నగారి మీద కలబడి బెలూన్ లాక్కోవాలని చూశాడు. వాడివ్వలేదు. ఇద్దరూ కలబడి కొట్టుకోవడం మొదలుపెట్టారు. వాళ్ళ అరుపులతో ఏడుపులతో రణరంగంగా మారిపోయింది ఇల్లు. శైలజకి చిర్రెత్తుకు వచ్చి చెరో నాలుగు అంటిస్తేగాని ఆ గొడవ సద్దుమణగలేదు.

"పిల్లలకి అడిగినవన్నీ కొనిస్తూ పోతే ఇలాగే తయారవుతారు."

గొణుగుతున్న మామగారి వైపు ఎర్రగా చూసింది శైలజ.

"పక్కింటి రాముకి వాళ్ళనాన్న గన్‌కొని పెట్టాడు. నాకూ కొనిపెట్టు, నాన్నా" అంటూ రెండు రోజులుగా వేపుకుతింటున్నాడు గోపి, తండ్రిని. అన్నయ్యకి గన్ కొనిస్తే నాకు రిమోట్ కారు కొనివ్వాలి" జయ డిమాండ్. ఆ రోజు సాయంకాలం పిల్లలిద్దరినీ తీసికెళ్ళి వాళ్ళడిగినవి కొనిచ్చాడు రమణ.

"ఎందుకురా, రమణా! పిల్లలు అడిగినవన్నీ కొనిచ్చి డబ్బు దండగ చేస్తున్నావు? తెచ్చినంతసేపు పట్టదురా వాటిని పాడుచేసి మూలకి విసిరేయడానికి! ఇప్పటికీ ఎన్ని గన్నులిప్పించావు. ఎన్ని బొమ్మలిప్పించావు? ఏదైనా జాగ్రత్తగా పెట్టుకొన్నారా? "మూడు రోజుల నుండి గోపీగాడు నా ప్రాణం తోడేస్తున్నాడు నాన్నా! ఏం చేయను"

✧ ✧ ✧

ఇంటి ముందు నుండి నైటీలవాడు పోతుంటే పిలిచి బేరాలు మొదలు పెట్టింది

శైలజ. ఎదిరింటి శ్వేత, పక్కింటి ఉమ కూడా వచ్చారు. నైటీలు చూడడానికి బేరాలు సాగీ సాగీ రెండు నైటీలు ఖరీదు చేసి డబ్బులిచ్చి లోపలికి వచ్చింది శైలజ.

"ఏంటమ్మా, ఎప్పుడూ ఈ బేరాలు? ఇంటి ముందు నుండి నైటీల వాడిని పోనివ్వవు! బెడ్‌షీట్లవాడిని పోనివ్వవు! చీరలవాడిని పోనివ్వవు! మళ్ళీ పండగలొస్తే పాకెట్లు పాకెట్లుకొని తెస్తూనే వుంటావు. మగడు జీతం తెచ్చి నీ చేతికిస్తున్నది జాగ్రత్త చేయమనే కాని, ఇలా విచ్చలవిడిగా ఖర్చు పెట్టమని కాదు! పిల్లలున్నారు. ముందు జాగ్రత్త వద్దా? మీ అత్తయ్యకి సంవత్సరానికి మూడే మూడు చీరెలు కొనిచ్చేవాడిని. అవీ పండగలకి వాటితోనే కాలక్షేపం చేసేదావిడ! బట్టకి పెట్టి భ్రష్టయిపోయాడట వెనుకటికి నీలాంటివాడెవడో." మామగారి హితోపదేశానికి మంటెత్తినట్టుగా అయ్యింది శైలజకి. అప్పటికేమీ అనలేదు. ఆయనరానీ అనుకొంది పళ్ళు పటపటలాడిస్తూ.

"వండి పెట్టిందేదో తిని కృష్ణారామా అనుకొంటూ ఓ మూలపడి వుండక ఇంటి విషయాల్లో మీ రెందుకు, నాన్నా జోక్యం చేసుకొంటున్నారు? ఇంట్లో ఆడవాళ్ళ విషయాలు నిజంగా మీకవసరమా?" నిలువెత్తు ఆగ్రహజ్వాలగా మారిపోయి అడుగుతున్న కొడుకువైపు బిత్తరపోయినట్టుగా చూశాడు పట్టాభి.

"ఏం చాడీలు చెప్పిందిరా నా మీద నీ భార్య?"

"చాడీలు చెప్పాల్సిన ఖర్మేంపట్టలేదు నాకు అన్నదే చెప్పాను. ఏదో ఒక నస మీది! ఎన్నాళ్ళని భరిస్తాను చెప్పండి? నేను బట్టలు కొన్నా తప్పే! పిల్లలకి ఏవైనాకొని పెట్టినా తప్పే! పుట్టిన రోజు పండుగలు చేసినా తప్పే! అదెందుకు దండగ ఖర్చు... ఇదెందుకు దండగ ఖర్చు అంటూ ప్రతీదానికి మీ సణుగుడు విని వినీ విసిగెత్తి పోయింది. మీ డబ్బు కాదుగా ఖర్చుపెట్టేది? మధ్యన మీకెందుకు కడుపునొప్పి నాకర్థం కావడంలేదు."

"మీ డబ్బు మీ డబ్బు అంటూ నన్ను పరాయి మనిషిని చేసి మాట్లాడుతోంది. నీ భార్య! ఏమిట్రా ఇది? ఇది నా ఇల్లు, నా పిల్లలు అన్న మమకారం చేతే కదరా దుబారా ఖర్చులు దేనికని చెప్పేది?" నొచ్చుకొన్నట్టుగా అన్నాడు పట్టాభి.

"పిల్లల చిన్న చిన్న సరదాలు నాన్నా అవి! అవి మనం తీర్చగల స్థితిలో ఉండీ తీర్చకపోతే ఇంకెందుకు నాన్నా ఈ జీవితం, ఈ సంపాదనా? నా ఉద్యోగం మీ లాగా నూటపాతిక రూపాయలతో స్టార్ట్ కాలేదు! ఇరవైవేలతో స్టార్ట్ అయ్యింది. ఇప్పుడు ముప్పైవేలు. ఇంకా పెరుగుతుంది. మొన్న ఇంటర్వ్యూ అయిన కంపెనీకి

సెలెక్ట్ అయితే నా జీతం ఏభైవేలు అవుతుంది. ఒక్కరైలు బొమ్మ కోసం, బొమ్మ తుపాకీ కోసం, పూలపూలషర్టుకోసం ఏడ్చి మీ చేత చావతన్నులు తిన్న సంఘటనలు నేనింకా మరిచిపోలేదు. నా చిన్నప్పుడు నా ఒక్క సరదా కూడా తీర్చలేదు మీరు! నన్ను కన్నందుకు మీరు నాకు చేసిన ఉపకారం ఒక్కటే ఎం.బి.ఏ. చదివించడం. అదొక్కటి తప్ప నాకు తలుచుకొని సంతోషపడడానికేమీ లేదు.

తను ఉద్యోగంలో చేరినప్పుడు తన జీతం నూట పాతిక! ఆ నూటపాతికలోనే నలభై రూపాయలు ఊరి దగ్గరున్న అమ్మకి పంపేవాడు. అదెంతో తృప్తి అనిపించేది తనకి! మిగిలిన జీతంతోటే రోజులు నెట్టుకొచ్చేవాడు. అప్పుడే తనకి పెళ్ళి కూడా అయ్యింది. జీతం కొంచెం కొంచెం పెరిగినట్టే సంసారమూ పెరిగింది. ఇద్దరాడ పిల్లలూ, ఒక మగపిల్లాడు! ప్రతీపైసా ప్లాన్‌గా ఖర్చుపెడితే తప్ప జీతం సరిపోయేది కాదు. తను రిటైర్ అయ్యేనాటికి పదిహేను వేల జీతం. ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు. చిన్నపాటి ఇల్లు కట్టుకొన్నాడు. కొడుకును ఎం.బి.ఏ. చదివించాడు. చిన్నదాని పెళ్ళికి అయిన లక్షరూపాయల అప్పు పెన్షన్ డబ్బురాగానే తీర్చేశాడు. తను ముళ్ళబాటన నడిచి కొడుక్కు పూలబాట పరిచాడు. ఈ రోజు జీతం అంతొస్తుంది ఇంతొస్తుందని విర్రవీగుతున్నాడే! తను అష్టకష్టాలుపడి ఆనాడు ఎం.బి.ఏ చదివించబట్టే కదా?

"నీ జీతం పెద్దదేరా! కాదన్నదెవరు? కాని, వచ్చిందంతా ఖర్చుపెట్టుకోవాలని లేదుగా? నాలుగు డబ్బులు తీసిపెట్టుకొంటే ముందు ముందు అవసరాలకి వస్తాయి కదా? పైన ఇల్లు కట్టావంటే కింద అద్దె కిచ్చుకోవచ్చు. నీ పిల్లలకి పెద్ద పెద్ద చదువులు చదివించవచ్చు. పిల్లల చిన్న చిన్న సరదాలు అంటున్నావే! తీరుస్తూపోతే వాళ్ళ కోరికలకు అంతుంటుందా? వాళ్ళకి నచ్చజెప్పాలి! వాళ్ళ ధ్యాసను డైవర్ట్ చేయాలి.

"వాళ్ళు అడిగినవి కొనివ్వకపోతే ప్రాణం తోడేస్తారు నాన్నా!"

"నాలుగు అంటిస్తే వాళ్ళే దారికి వస్తారు. మరీ ఇంత గారాబం చేస్తే చేతికి రాకుండా పోతారు".

"పిల్లల్ని కొడుతుంటే అడ్డుపడే తాతగార్లని చూశానుగాని ఇలా తన్నమని సలహాలిచ్చే తాతగారిని మిమ్మల్నే చూస్తున్నాను. మనుమలంటే ఆహా ఎంత ప్రేమ!" శైలజ వెటకారం చేసింది.

"పిల్లల్ని భయభక్తుల్లో పెంచమన్నాను గాని, వాళ్ళంటే నాకు ప్రేమ లేదంటే నా మనసుకు చాలా కష్టమనిపిస్తుందమ్మా! ఇంకెప్పుడూ పొడిచినట్టుగా ఇలా

మాట్లాడకు! నేను మీ మంచికోరే వాడినే గాని చెడుకోరేవాడిని కాదు" బాధగా అన్నాడు పట్టాభి.

"ఇంటి విషయాలు సమర్థవంతంగా చూచుకోవడానికి నేనున్నాను. శైలు ఉంది. నాకు ముప్పై అయిదేళ్ళ వయస్సంటే మంచీ చెడు తెలిసిన వయస్సే కదా? ఇంకా మీ గైడెన్స్ అవసరమా? అసలు... ఇంకా మీకీ తాపత్రయం అవసరమా? కృష్ణారామా అనుకొంటూ ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించండి. ఇంట్లో మీకూ మనశ్శాంతి లేకుండా చేసుకొని మాకూ మనశ్శాంతి లేకుండా చేయకండి" అనేసి విసురుగా అక్కడి నుండి వెళ్ళిపోయాడు రమణ.

నల్లబడిన ముఖంతో వచ్చి వీధి అరుగుమీద కూర్చున్నాడు పట్టాభి. అతడి ముఖంలో విచారం అలుముకు పోయింది. బయట గేటు పక్క గోడమీద 'శారదా నిలయం' అన్న పేరు తనని చూసి నవ్వినట్టుగా అనిపించింది. ఈ సిటీలో దాదాపు ఇరవయ్యేళ్ళు అద్దె ఇంట్లోనే గడిచిపోయింది. స్వంత ఇంటి కోసం ఎన్ని కలలు కన్నారు తనూ, తన భార్య శారద? తన చిన్న జీతంలో కొద్ది కొద్దిగా మిగిల్చి చీటీలు కట్టి, రికరింగ్ చేసీ, ఇన్సూరెన్స్ చేసీ... ఎన్నో కష్టాలుపడితేగాని తన స్వంత ఇంటికల సాకారం కాలేదు. ఈ చిన్నిగూడు కోసం ఎన్నో కలలు బలి పెట్టుకోవలసి వచ్చింది. ఈ ఇంటి ప్రతి ఇటికలోనూ, వాడిన ప్రతి ఇసుక రేణువులోనూ తన శ్రమ బిందువులున్నాయి. ఎన్నో చంపుకొన్న కోరికలున్నాయి. ఇన్నాళ్ళకి ఈ ఇల్లు తనకేమీ కానట్టనిపిస్తోంది. ఒక పెద్ద కంపెనీకి మేనేజరు అయ్యి నెలకి ముప్పై వేలు సంపాదిస్తున్న తన కొడుక్కోసం ఈ తండ్రి భుజాలనే మెట్లుగా చేశాడన్న స్పృహ వాడికేమైనా ఉందా? అదేనా ఒక కొడుకు తండ్రిపట్ల చూపించాల్సి కృతజ్ఞత? కృష్ణా రామా అనుకొంటూ ఒక మూల పడివుండమంటాడా?

"నాది నాది అనుకొంటున్న ఈ ప్రపంచమే నీది కాదు. నువ్వు పుట్టకముందు ఉంది ఈ ప్రపంచం! నువ్వు గిట్టాకా ఉంటుంది. ఈ ప్రపంచంలో నువ్వు కేవలం ఇక్కడికి వచ్చిపోయే అతిథివి మాత్రమే అసలు నేను నేను అనుకొంటున్న నువ్వు నువ్వు కాదు నీ నిజస్వరూపం వేరే! నువ్వు వేరే! ఆత్మవి కావు! దేహానివి కావు! ఏమీ కావసలు!

స్వామీజీ ప్రసంగం లౌడ్‌స్పీకర్ ద్వారా గాలిలో తేలివస్తూంటే అరె! ఈ రోజు ఈ గొడవలోపడి గుడికి వెళ్ళడం మరిచానే అనుకొన్నాడు పట్టాభి. ఈ వీధి మలుపులోనే ఉంది వెంకటేశ్వరస్వామి మందిరం దసరా నవరాత్రుల సందర్భంగా ఆలయ

కమిటీవారు ఒక స్వామీజీ గారి చేత ప్రవచనాలు ఏర్పాటు చేయడం జరిగింది. రోజూ అరున్నర నుండి తొమ్మిది గంటల వరకు ఆయన ప్రసంగం ఉంటుంది. లౌడ్ స్పీకర్ నుండి ఆ ప్రసంగం ఆ కాలనీ అంతా వినిపించే ఏర్పాటు ఉంది. నాలుగు రోజుల నుండి పట్టాభి, ఆయన మిత్రుడు గోపాలంతో కలిసివెళ్ళి ప్రసంగం పూర్తి అయ్యేవరకు ఉండి, పూజారి దేవుడికి హారతి ఇచ్చి, ఇచ్చే ప్రసాదం తీసుకొని రావడం అలవాటు.

పట్టాభి దిగ్గున లేచి ఇంట్లోకి వచ్చి షర్టు వేసుకొని జోళ్ళేసుకొని బయల్దేరుతుంటే చిన్నాడు వెంటపడ్డాడు. "ఎక్కడికి తాతయ్యా? నేనొస్తాను."

"వద్దురా! చాలా రాత్రవుతుంది నేనొచ్చేసరికి! రాత్రిపూట బూచాళ్ళుంటారు చీకట్లో".

"ఇంత వయసొచ్చింది! పిల్లలతో ఏం మాట్లాడాలో తెలియదు! పిల్లలకి పిచ్చి పిచ్చి మాటలు చెప్పి లేనిపోని భయాలు నేర్పకండి" శైలజ కొడుకును బరబరా లోపలికి లాక్కుపోయింది.

పట్టాభి మనసు చివుక్కుమన్నట్టుగా అయ్యింది. కొడుకూ కోడలు తనకి ఏపాటి విలువ ఇస్తున్నారో అర్థమౌతుంటే మనస్సు కుంగి పోయినట్టుగా అయ్యింది పట్టాభికి. ఈ చీదరింపులూ, విదిలింపులూ ముదరక ముందే ఇక్కడి నుండి బయటపడితే మర్యాదగా ఉంటుంది కదా అనుకొన్నాడు. కానీ, ఎక్కడికి వెళ్ళాలి? తన కడుపున పుట్టిన పిల్లలు ఇంకా ఇద్దరున్నారు. కానీ, ఆడపిల్లలు! పెళ్ళి చేసుకొని పరాయింటికి వెళ్ళిన వాళ్ళు వెళ్ళి వెళ్ళి వాళ్ళ పంచన ఎలా చేరుతాడు? కుక్కకంటే హీనమైపోదూ బతుకు? తనకి నెలకి ఎనిమిది వేల పెన్షన్ వస్తుంది. తనలాంటి వాళ్ళు తలదాచుకోవడానికి ఎన్ని ఓల్డేజీహోములు లేవు.

అతడి ఆలోచనలు పూర్తికాకముందే దారిలోనే ఉన్న గోపాలం ఇల్లు వచ్చింది. పట్టాభి కోసమే చూస్తున్న అతడు బయల్దేరుతూ "ఎందుకురా ఈ రోజు ఆలస్యమైంది?" అని అడిగాడు.

"వృద్ధాప్యం వచ్చాక బతకడం అనవసరం! ఈ భూమ్మీద ఇంకా ఉండి ఏం చేస్తాం అనిపించిందీ రోజు".

"హఠాత్తుగా ఈ వైరాగ్యం ఏమిటి, పట్టాభీ?" గోపాలం ఆశ్చర్యపోయాడు.

"శారద ఎంత పుణ్యాత్మురాలోనని ఇప్పుడనిపిస్తోంది. ఈ ప్రపంచంలో ఎన్నెన్ని

విద్దూరాలు! ఎన్నెన్ని వికృతాలు! అవేవీ చూడకుండా పడుకొన్నది పడుకొన్నట్టుగా పుణ్యలోకాలకు వెళ్ళిపోయింది" పట్టాభి గొంతు డగ్గుత్తికగా మారింది.

ఏదో బాధ కలిగించే సంఘటనే జరిగినట్టుంది అనుకొన్నాడు గోపాలం. పట్టాభి భార్య నిద్రలోనే తనువు చాలించింది. నిద్రలోనే ఏ హార్టెటాకో వచ్చి ఉంటుందనుకొన్నారంతా. ఆమె పోయి కూడా అయిదేళ్ళవుతోంది. మాటల్లోనే మందిరం వచ్చింది.

ముందు వరుసలోనే రెండు కుర్చీలు ఖాళీగా ఉంటే వెళ్ళి కూర్చున్నారు.

స్వామీజీ ప్రసంగం కొనసాగుతోంది. "కురుక్షేత్ర యుద్ధం చివరికి వచ్చింది. భీష్ముడు అంపశయ్య మీదున్నాడు ప్రాణత్యాగం చెయ్యడానికి పుణ్యకాలం కోసం ఎదురు చూస్తూ! "మాకు రాజనీతి బోధించండి, తాతగారూ!" అంటూ పాండవులు ఆయన చుట్టూ నిలబడ్డారు. రాజులు ఎలా నడుచుకోవాలి, జీవితంలో సత్యం ధర్మం తప్పకుండా ఎలా చరించాలీ... చెబుతున్నాడు భీష్ముడు. ఆయన చెబుతున్న ధర్మ పన్నాలు వింటున్న ద్రౌపది ఫక్కున నవ్వి అడిగిందట – ఆనాడు కౌరవులు నిండు సభలో నా వలువలూడదీస్తుంటే ఈ నీతులన్నీ ఏమయ్యాయి, తాతగారూ! ఒక్క మాట... ఒక్క మాట... ఇదేమి అన్యాయమని అడగలేదే? తలొంచుకొని రాయిలా కూర్చున్నారే?" అని దులిపేసింది!

"నువ్వన్నది నిజమే తల్లీ! నేనప్పుడు అధర్మం పక్షాన ఉన్నాను! అధర్మపు కూడు తింటున్నాను. సహవాస దోషంవల్ల ఆ మాయ నన్ను కమ్మి నా నోటిని బంధించింది! ఇప్పుడు అధర్మం చెరవీడాను. మబ్బులు తొలిగిన ఆకాశంలా నా మనసు ప్రకాశిస్తోంది! సత్యం స్పష్టంగా నా కళ్ళ ముందు కనిపిస్తోంది!..." అంటాడు భీష్ముడు. దీన్నిబట్టి మనకు ఏమర్థమౌతుంది? సజ్జన సాంగత్యం చేయాలనీ, దుష్టులకు దూరంగా ఉండాలని! అలాగే సాత్వికమైన ఆలోచనలకు స్వాగతం పలకాలి! దురాలోచనలను దూరం చేయాలి! ఎంతో అమూల్యమైనది మానవజన్మ. జీవరాశులన్నిటిలోకి ఉత్తమమైనది మానవ జన్మ. దేవతలు సైతం "ముక్తిని పొందాలంటే మానవ జన్మ ఎత్తి ఆధ్యాత్మిక సాధనలు చేసినప్పుడే అది సాధ్యమని చెబుతారు. అలాంటి దుర్లభమైన మానవ జన్మ ఎత్తి మనం ఏం చేస్తున్నాం? అరిషడ్వర్గాలకు బానిసలమై మనిషికుండాల్సిన మానవ లక్షణాలను పోగొట్టుకొని అధోగతిలో పడిపోతున్నాం. ఇంకా ఎన్నాళ్ళు ఈ తమస్సులో కొట్టుమిట్టాడుతారు? మేలుకొనండి! లేవండి! మీలో జ్ఞానమనే జ్యోతని వెలిగించండి! ఆ వెలుగులో మీ లోపలికి చూచుకోండి! ఒక అద్భుతం మీ ముందు సాక్షాత్కరిస్తుంది! నిజమైన ప్రపంచం

అక్కడ కనిపిస్తుంది! అక్కడ గోచరిస్తుంది, సత్యమైన పదార్థమేదో! సత్యం సాక్షాత్కరించాక తెలుస్తుంది మనం ఉంటున్న ఈ ప్రపంచం ఎంత మాయనో, ఎంత బూటకమో! నిజానికి ఈ ప్రపంచం ఒక మరీచిక లాంటిది! లేనిది ఉన్నట్టుగా భ్రమింప జేస్తుంది. సత్యశోధన ప్రారంభించండి!..."

ఎందుకో పట్టాభి మనసు స్వామీజీ ప్రసంగం మీద లగ్నం కావడం లేదు. కొడుకూ కోడలి మాటలే చెవిలో గింగురుమన్నట్టుగా అవుతున్నాయి. మనసుకు శూలాలు గుచ్చుకొన్నట్లుగా అవుతోంది. ఇంత వయసు వచ్చి పిల్లలతో మాటలు పడడం ఎంత బాధాకరం? ఎంత అవమానం? ఆలోచనల సుడిగుండంలో చిక్కుకొని స్వామీజీ ప్రసంగం ముగియడంగాని, పూజారి దేవుడికి హారతి ఇచ్చి భక్తులకు ప్రసాదం పంచడంగాని, భక్తులు వెళ్ళిపోవడం గాని గమనించలేదు పట్టాభి.

గోపాలం లేచి వెళ్ళి ప్రసాదం తీసుకొని, "వెళ్ళి ప్రసాదం తీసుకోరా! మనమూ బయల్దేరుదాం" అన్నాడు.

పట్టాభి దీర్ఘంగా ఒక నిట్టూర్పు విడిచి "ప్చ్! మనసు చాలా పాడైందిరా, గోపాలం! ఇంటికి వెళ్ళాలనిపించడం లేదు! నా ఇంట్లోనే నన్ను పరాయివాడిని చేసి మాట్లాడాక ఇంకా ఏ ముఖం పెట్టుకొని వెళ్ళాలి?" అన్నాడు.

పక్కనుండి వెడుతున్న స్వామీజీ చెవిలో పడ్డాయి ఆ మాటలు. "ఏమిటి పట్టాభిగారూ! ఈ రోజు చాలా విచారంగా కనిపిస్తున్నారు?" అని అడిగాడు.

"కనిపెంచిన పిల్లల చేతే మాటలు పడడం అంత అవమానం, బాధా ఇంకదేనివల్లా కలుగదు స్వామీజీ!" అంటూ మనసులో బాధవెళ్ళ బోసుకొన్నాడు పట్టాభి.

"పిల్లలు పుట్టి పెద్దయ్యే దాకా వాళ్ళకి మన తోడిదే ప్రపంచం! వాళ్ళకి పెళ్ళిళ్ళయ్యి, పిల్లలయ్యి వాళ్ళతో జీవించడం మొదలు పెట్టాక వాళ్ళకి వాళ్ళతోటే ప్రపంచం అవుతుంది. వాళ్ళ ఆలోచనలూ, మాటలూ, చర్యలూ అన్నీ ఆ ప్రపంచం నుండే వస్తాయి. నా పిల్లలే నాకు పరాయి అయ్యారే అని బాధపడడంలో అర్థం లేదు. ఇది చాలా సహజమైన పరిణామంగా మనం స్వీకరించక తప్పదు.

"ఇంటికి పెద్దవాడినన్న గౌరవం లేకుండా...."

"పెద్ద మీ శరీరమా? మీ ఆత్మనా? మృత్యుకుహరంలో ప్రవేశించాక ఏ అమ్మ గర్భంలోనో జన్మ తీసుకొంటారు. అప్పుడు మీరు అందరికంటే చిన్నవారే కదా? ఈ

బాధలన్నీ మన దృష్టి కోణం సరిగా ఉండకపోవడం వల్ల వస్తున్నాయి! మీ వయసు ఇప్పుడు ఎంత?"

"అరవై తొమ్మిది! డిసెంబరు వస్తే డెబ్బై పడతాయి!"

"మనిషి సగటు ఆయుర్దాయం డబ్బై అనుకొంటే - మీరు దిగిపోవలసిన స్టేషన్‌కి అతి సమీపంగా ఉన్నారనే కదా అర్థం? మహా అయితే ఒకటి రెండేళ్ళు ఎక్స్‌టెన్షన్ కావచ్చు! ఇప్పుడు... ఈ వయసులో ఈ తాపత్రయాలు అవసరమా? ఇంకా కొడుకులు కోడళ్ళ మీద అజమాయిషీ చెలాయించి మీ పెద్దరికం నిలబెట్టుకోవాలని, ఇంట్లో అంతా మీ ఇష్ట ప్రకారమే నడుచుకోవాలనీ... చాలా ఇళ్ళలో పెద్దవాళ్ళు పిల్లలకి దూరమౌతున్నది ఈ అనవసరపు జోక్యం వల్లనే. పెద్దవాళ్ళు తమ మూర్ఖత్వంవల్లనే పిల్లల నుండి పొందాల్సిన ప్రేమాభిమానాలను పోగొట్టుకొని వృద్ధాశ్రమాల పాలవుతున్నారు!"

"తల్లిదండ్రుల మంచి చెడ్డలు పట్టించుకోని కఠినాత్ములు లేరా, స్వామీజీ?"

"లేరని ఎలా అంటాను. ఫిఫ్టీ ఫిఫ్టీ! పిల్లలు కఠినాత్ములూ, ప్రేమాభిమానాలకూ, అనుబంధాలకూ విలువ ఇవ్వని వారుగా తయారవుతున్నారంటే తప్పు వాళ్ళది కాదు! వాళ్ళను పెంచిన తల్లిదండ్రులది! ఈనాడు చాలా మంది తల్లిదండ్రులు చేస్తున్న తప్పు ఒకటుంది! పిల్లల డ్రెస్సుల మీద, వాళ్ళ రాంకుల మీదా, కెరీర్ మీదా చూపే శ్రద్ధ వాళ్ళ కారెక్టర్ మీద చూపడం లేదు! జీవితంలో కెరీర్ ముఖ్యమే! కాని, కెరీర్ కంటే ముఖ్యమైనది కారెక్టర్ అని గుర్తుపెట్టుకోవాలి! జీవితంలో నైతిక విలువలు అతి ముఖ్యమైనవి! ప్రతివారూ గొప్పవారు కావచ్చు! కాకపోవచ్చు! కాని, మంచి వారుగా దిద్దడానికి కృషి చేయాలి! ప్రేమ, దయ, శాంతి, ధర్మం, అహింస, ఇవి చిన్నప్పుడే వాళ్ళలో నాటి పెంచితే ఏ తల్లిదండ్రులకీ మీలా బాధపడే అవసరం రాదు! వాళ్ళు దుబారా చేస్తున్నారని, ముందు చూపులేదని బాధపడుతున్నారే? అసలు మీకుందా ముందు చూపు? ఎందుకు పుట్టాం? ఏమిటీ జీవితం అని ఒక్కనాడైనా ఆలోచించారా? ఎందుకు పుట్టామో తెలియదు! ఎందుకు బతుకుతున్నామో తెలియదు. ఎందుకు చస్తున్నామో, ఆ తరువాత ఏమిటో కూడా తెలియదు. తెలిసికోవాలన్న జిజ్ఞాస కూడా లేకుండా బతికేస్తున్న మనిషికీ పశువుకీ తేడా ఏమిటి? నిద్రలో సగం జీవితం గడిచిపోయింది! బాల్యం కొంత కాలం గడిచిపోయింది. యౌవనం ఒళ్ళు తెలియకుండా గడచిపోయింది! వార్ధక్యం కూడా కొంత గడిచిపోయి చివరి స్టేజీకి

వచ్చేశారు! ఇప్పటికైనా కొంచెం పారమార్థిక చింతనకు చోటివ్వరాదా? ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం తెచ్చుకోరాదా?..."

"అంత సులువా వైరాగ్యం తెచ్చుకోవడం?" శుష్కంగా నవ్వాడు పట్టాభి.

"ఏమిటీ జీవితం? మరణం తరువాత ఏమౌతాం? ఎక్కడికి వెడతాం?... ఇలా ఏ తర్కమూ లేకుండానే ఏ ఆలోచనా లేకుండానే ఆయువున్నంత వరకు ఉండి చివరికి కుక్కల్లా, నక్కల్లా రాలిపోవడానికే నా ఉత్కృష్టమైన ఈ మానవ జన్మ ఎత్తింది? జీవితం గురించి ఆలోచించండి! దీన్ని అర్థవంతంగా చేసుకోవడమెలాగో చూడండి! మీలో ఆలోచన ప్రారంభమైతే చాలు – అంతర్వాణి గురుస్థానంలో ఉండి మీకు కర్తవ్యాన్ని నిర్దేశిస్తుంది! కాని, ఒక్కటి! అంతర్వాణి మాటలు మీ చెవిని పడాలంటే ముందు మీ మనసు మౌనం వహించాలి! హృదయంలో గాఢమైన నిశ్శబ్దం అలుముకోవాలి! ఎక్కడా ఆలోచనల సవ్వడి ఉండకూడదు! మనసు మౌనం వహించాలంటే అదంత సులువైన విషయం కాదు! మనసు మౌనం వహించడంతో ఒక మహాశూన్యం హృదయాన్ని ఆవరిస్తుంది. ఉండీ లేని ఆ స్థితి... ఒక మహాద్భుతాన్ని ఆవిష్కరిస్తుంది హృదయంలో! మాటలకందని ఒక దివ్యానుభూతిని పొందుతారు! అప్పుడు తెలుస్తుంది. జీవితాన్ని ఇంతవరకు ఎంత నిస్సారంగా గడిపామన్నది! కొడుకూ కోడలు సరిగా చూడలేదనుకోవడం, ఛీ ఎందుకీ బతుకని సంకట పడడం... ఇదంతా ఎంత అర్థంలేని వ్యవహారమో అప్పుడు తెలుస్తుంది! కన్న వాళ్ళకి పట్టెడన్నం కూడా పెట్టక తరిమివేసే కసాయిపిల్లలతో మీ కొడుకూ కోడల్ని పోల్చుకు చూడండి! వాళ్ళెంత ఉత్తములుగా కనిపిస్తారో? మీకు వేళకు తిండి తిప్పలు సరిగా చూస్తూనే ఉన్నారు కదా? కేవలం మీ మాటను గౌరవించడం లేదనే కదా మీ బాధంతా? నలభైయేళ్ళొచ్చి, ఇద్దరు బిడ్డల తండ్రి అయిన కొడుకు సంసారంలో మీ జోక్యం అవసరమా? ఆర్థికంగా బాగా ఉండి కూడా చాలా మంది తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపుతున్నారంటే, తమ పెద్దరికంతో వాళ్ళని అనవసర చీకాకులకు గురిచేసి తను చీకాకు పడడం వల్లనేనని నా ఉద్దేశ్యం! ఈ సంసారం ఒక చెత్త బుట్టలాంటిది! మోసినన్నాళ్ళు మోశారు. ఇంకా ఇంకా మోయాలని సరదా ఏమిటి? ఆ బుట్టని ఒక్క క్షణం దింపుకొని చూడండి. అప్పుడెంత హాయిగా అనిపిస్తుందో! ఈ చెత్త బుట్టని ఇన్నాళ్ళు ఇంత పరమానందంగా ఎందుకు మోశామా అని కూడా అనిపిస్తుంది! ఈ వయసులో మీకు కావలసిందేమిటి? ప్రశాంతత! అది మీలోనే ఉంది! మీ చేతిలోనే ఉంది! అనవసర విషయాల జోలికి పోకుండా మీలో మీరుండడంవల్ల వస్తుంది ఆ ప్రశాంతత!

మీలో మీరుండడం సాధ్యం కాదనుకొంటే మనసు పెట్టి భగవంతుడి నామసంకీర్తన చేయండి! ఎంత ఆనందం అనిపిస్తుందో! ఎంత ప్రశాంతత మనసులో నిండి పోతుందో! కాదూ... కొడుకూ కోడల్ని ఆడిపోసుకోవడంలోనే ఉంది నా కానందం అని మీరనుకొంటే అది మీ ఇష్టం! ఇక నేను చెప్పేదేమి ఉండదు!"

"నాకు కనువిప్పు అయింది స్వామీజీ! ఇంట్లో వాళ్ళు ఏం చేసుకొంటే నాకెందుకు? నాకు కర్తవ్యం నిర్దేశించండి! నేను ఈ క్షణం నుండి మీ శిష్యుడిని!"

"భగవన్నామస్మరణ చెయ్యండి! ధ్యానం చెయ్యండి!"

"ధ్యానమంటే - మనసు దేని మీద లగ్నం చేయాలి? భగవంతుడి రూపంమీదా? నామం మీదా?"

"ధ్యానమంటే అసలేమీ చేయకుండా ఉండడం! ఆలోచనా రహిత స్థితికి చేరుకోవడం! రూప ధ్యానం చేసినా, నామ ధ్యానం చేసినా చివరికి ఆలోచనారహిత స్థితికి చేరుకోవడానికే! శ్వాస మీద ధ్యాసుంచండి! ఇంకా త్వరగా ఆ స్థితికి చేరుకోగలరు!"

✧ ✧ ✧

రోజూ రెండు పూటలా ధ్యాన సాధన చేయమన్నాడు స్వామీజీ! కూర్చోడానికి ఎక్కడైతే బాగుంటుందీ? ఇంట్లో పిల్లల గోల! టీవీమోత! పెరట్లో చెట్ల మధ్య అయితే కాస్త ప్రశాంతంగా ఉంటుంది కదాని ఉదయం స్నానం చేయగానే చంకలో చాపమడిచి పెట్టుకొని పెరట్లోకి వచ్చాడు పట్టాభి.

ఇంటి వెనకాల చిన్న పెరడు! ఆ కాస్త స్థలంలోనే ఎన్నో పూలమొక్కలు వేసి పెంచింది పట్టాభి భార్య శారదమ్మ. తెల్లారీ తెల్లారక ముందే కింద మంచు ముక్కల్లా రాలిపడే పారిజాతాలు! పచ్చటి ఆకుల మధ్య తెల్లగా తొంగి చూస్తే నందివర్ధనాలు. ఆ పక్కనే ముద్ద గన్నేరు గులాబిరంగు పూలతో! ఆ పక్కనే సుకుమారంగా విచ్చుకొనే కనకాంబరాలు! అప్పుడప్పుడు ఎక్కడి నుండో ఎగిరొచ్చి కిచకిచ శబ్దాలు చేసి పువ్వు పువ్వును పరామర్శించి పరిసరాలను ఆహ్లాదభరితంగా మార్చి వెళ్ళే ఏదో పేరు తెలియని చిన్న పిట్టలు!

ఇక్కడ రోజూ సాయంత్రం పూలు కట్టుకొంటూ కూర్చొనేది శారద! శారదకి

ఈ మొక్కలంటే ఎంత ప్రాణమో! ఇవి ఇప్పుడు శారద వదిలిపోయిన గుర్తులయ్యాయి!... ఎందుకో పట్టాభి నుండి ఒక నిట్టూర్పు వెలువడింది.

పారిజాతం చెట్టు కింద చీపురుతో శుభ్రం చేసి చాప వేసుకొని సుఖాసనంలో కూర్చొని చేతిలో చెయ్యి వేసుకొని కళ్ళు మూసుకొన్నాడు పట్టాభి. మనసు శ్వాసమీద పెట్టమన్నాడు కదా స్వామీజీ!... శ్వాస మీద ధ్యాసపెట్టడానికి కిందా మీదా పడసాగాడు. మనసు ఎటెటో వెళ్ళి పోతున్నది! గతంలో దాగిపోయిన జ్ఞాపకాలను పనిగట్టుకొని తవ్వుతున్నది.

ఆ పక్కనే వున్న కిచన్ కిటికీలోంచి 'సుయ్' మని పప్పులో పోపుగంటె అద్దిన శబ్దం చెవిలో, నూనెలో వేగిన వట్టి మిర్చి ఘాటు ముక్కులోకీ చేరాయి.

ఈ రోజు శైలజ చింతకాయలు వేసి పప్పు చేస్తున్నానని రమణతో చెప్పడం తను స్నానానికి వెడుతున్నప్పుడు విన్నాడు. చింతకాయల పప్పులో ఇంగువ పోపు పెడితే... ఆ రుచీ... ఆ ఘుమఘుమ...

"కాస్త పప్పు విడిగా తీసి ఇంగువ పోపు పెట్టమ్మా' అని కేకేద్దామనిపించింది. ఒకసారి ఇలాగే 'చింతకాయల పప్పులో ఇంగువ పోవు పెట్టమ్మా" అని అడిగితే ఏమంది కోడలు? 'పప్పులో ఇంగువ పోపు పెడితే 'గబ్బు కంపు' అని పిల్లలు తినరు, మామయ్యా?' అంది.

"నాకు కాస్త విడిగా తీసిపెట్టొచ్చు కదమ్మా!"

"ఇంట్లో వున్న నలుగురికి నాలుగు రకాలుగా చేయడం నా వల్లకాదు! చేసిందేదో తినండి!" అని విసుక్కుంది.

ముసలాళ్ళకి జిహ్వా చాపల్యం ఎక్కువ కదా!

కోడలి నోటికి భయపడి ఎన్ని కోరికలు చంపుకొన్నాడో!

ధ్యానం చేయడానికి కూర్చొని ఇంగువ పోపు గురించి నోట్లో నీళ్ళూరించుకొంటున్నా డేమిటి తను? ఛీ!

నిన్న స్వామీజీ ఏం చెప్పాడు? మితభాషణం లాగానే మితాహారం కూడా ఉండాలని చెప్పలేదూ?

"మనిషిగా పుట్టడం దేవుడిచ్చిన అరుదైన వరం! ఈ శరీరం ఒక దేవాలయం లాంటిది! దేవాలయాన్ని ఎంత పవిత్రంగా, శుభ్రంగా ఉంచుకొంటామో ఈ శరీరాన్నీ

అలాగే ఉంచుకోవాలి! జిహ్వ కోరినవన్నీ పొట్టలో పడేసి దాన్ని కంపుగా మార్చుకోకూడదు! కడుపుకు సగానికి మాత్రమే ఆహారం - అదీ సాత్వికాహారం తీసుకొని మిగతా సగాన్ని గాలికీ నీరుకూ వదిలేయాలి రోజుకు మూడు పూటలు తింటే 'రోగి', రోజుకు రెండు పూటలు తింటే 'భోగి', రోజుకు ఒక్కపూట తింటే 'యోగి'... మీరే నిర్ణయించుకోండి రోగి కావాలో, భోగి కావాలో, యోగి కావాలో..." స్వామీజీ మాటలు మనసులో ప్రతిధ్వనించాయి.

కొడుకూ కోడలిలో తప్పులు చూడడం కాక మంచినే చూడమని చెప్పాడు కదా స్వామీజీ! అందరిలో మంచి చూడడం మొదలు పెడితే తమలోనూ ఆ మంచి చోటు చేసుకొంటుందట!

కళ్ళు మూసుకొని మనసును అంతర్ముఖం చేసుకొని... వచ్చే ఆలోచనలను కట్ చేస్తూ చేస్తూ పోతే చివరికి ఆలోచనారహిత స్థితికి చేరుకోవచ్చన్నారు. ఏదీ... నిరంతరంగా వస్తున్న ఈ ఆలోచనల వెల్లువ వద్దనుకొన్న కొద్దీ పుట్టుకు వస్తూనే వున్నాయి. కదా! నిన్న ఒక భక్తుడు "ధ్యానం కుదరడం లేదు స్వామీజీ" అన్నాడు.

"విత్తనం ఎకా ఎకీ తీసుకుపోయి బీడు భూమిలోనో, రాళ్ళల్లోనో వేయరు కదా? కంప చెట్లు తొలగించాలి! ఆలోచనలు అనే కంపను తొలగించాలి! విషయ వాంఛలనే రాళ్ళు రప్పలు ఏరివేయాలి! మంచి ఆలోచనలనే ఎద్దులు కట్టి దుక్కి దున్నాలి! ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి తొలగించుకోవాలి! ధ్యానం జీవితంలో ఏదో ఒక పూటకు పరిమితం కాకూడదు! జీవితమే ధ్యానం కావాలి! చేయాల్సిన చెడు పనులన్నీ చేసేసి, తలనిండా విషపు ఆలోచనలు నింపుకొని కళ్ళు మూసుకు కూర్చోగానే ధ్యానం కుదరమంటే కుదరదు సజ్జనసాంగత్యమూ, సద్గ్రంథ పఠనం అలవాటు చేసుకోండి!"

..........................

రోజులు గడుస్తున్నాయి!

పట్టాభి ధ్యాన సాధనలో పురోగతి సాధించాడో లేదో గాని...

"ఏమిటి, నాన్నగారు మాట్లాడడం బొత్తిగా తగ్గించేశారు? ఈ మధ్య నేను కొంచెం రాష్‌గా మాట్లాడుతున్నందుకు ఆయన బాగా నొచ్చుకొన్నట్టున్నారు! ఈ వయసులో ఆయన మనసు నొప్పించడం తప్పే కదా! ముసలాయన చాదస్తం కొద్దీ ఏదో ఒకటి అంటే అననీలే అని ఊరుకొంటే పోయేదానికి... నేను కొంచెం కటువుగానే

మాట్లాడాను! శైలూ, నువ్వు కూడా ఆయన్ని ఏమీ అనకు! ఈ వయసులో ఆయన్ని బాధపెడితే మనకేం వస్తుంది చెప్పు?"

"ఆయన ప్రవర్తన ఎప్పటికీ ఇలాగే ఉంటే నెత్తిన పెట్టుకోవచ్చు లెండి! కాని, ఉండదే! అన్ని విషయాలూ తనకే కావాలి! అన్నిటికీ సణుగుడొకటి! అన్నిటిలో వేలు పెడితే చిర్రెత్తుకు రాక చస్తుందా?"

"ముసలాళ్ళకి అది నైజమని మనం సరిపెట్టుకోవాలి! మాటకి మాట ఎదురు చెప్పకుండా మనం మౌనంగా ఊరుకొంటే సరిపోతుంది! పిల్లలతో ఆడుకొంటూ, వాళ్ళని పక్కలో చేర్చుకొని, కథలవీ చెప్పి నిద్రపుచ్చే ఆయన ఇప్పుడు పిల్లలతో కూడా మాట్లాడడం లేదు! అన్నిటినీ, అందరికీ దూరంగా ముడుచుకు పోయినట్టుగా ఉంటున్న ఆయన్ని చూస్తుంటే నాకెందుకో బాధగా ఉంది, శైలూ..."

"స్వామీజీ! మీకు కృతజ్ఞతలు! నాకు సరైన మార్గమే నిర్దేశించారు! పోగొట్టుకొన్న మర్యాదను మౌనంతో తిరిగి పొందాను!" సంతృప్తితో కూడిన నవ్వు కదిలింది పట్టాభి పెదవుల మీద! చీకటి నుండి వెలుగులోకి వచ్చినట్టుగా అనిపించింది ఆయనకు!

చేతన మాసపత్రిక, ఆగష్టు 2008

◆